ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు
3
గురువారం 12 జూన్ 2025

కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి ఏడాది పూర్తవుతోంది. ఈ సంవత్సర కాలంలో జిల్లాలో అనేక రంగాల్లో ప్రజల అవసరమెరిగి.. సంక్షేమ, అభివృద్ధి పథకాలను చంద్రబాబు సర్కార్ చేపట్టింది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, పేదల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. మొదటి ఏడాదిలో సిమెంటు రోడ్ల నిర్మాణం, ఉచిత సిలిండర్లు.. అన్నాక్యాంటీన్ల ఏర్పాటుతో సామాన్య జనం పాలన భేష్ అనేలా చంద్రబాబు సర్కార్ పేరు తెచ్చుకుంది. అంతేకాక డీఎస్సీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు గురువారం తల్లికి వందనం నగదు కూడా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ కానుంది. ఈ నేపథ్యంలో ఏడాది కూటమి పాలనలో జిల్లా అభివృద్ధి పథంలో పయనించడంపై ప్రత్యేక కథనం.

అభివృద్ధి పథంలో...

● ప్రజల అవసరమెరిగి.. సంక్షేమం వైపు పరుగులు

కూటమి ఏడాది పాలన

- రూ.244 కోట్లతో సిమెంటు రోడ్లు
- రూ.21.45 కోట్లతో తారురోడ్లు
- రూ.23.85 కోట్లతో పనుల పురోగతి
- పారదర్శకంగా.. చౌకదుకాణాలతో రేషన్ పంపిణీ
- ఇంటి వద్దకే పెన్షన్లు
- అదుపులో శాంతిభద్రతలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడానికి ఉన్న అనేక కారణాల్లో.. రోడ్లను పట్టించుకోకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. గతంలో చినుకు వాన పడినా... గుంతల రోడ్లలో ప్రయాణించలేక.. ప్రమాదాలకు గురై.. ఇబ్బందులు పడిన జనం.. ఇప్పుడు సురక్షితంగా ప్రయాణిస్తున్నారు. వైసీపీ పాలనలో రోడ్లపై మోకాటి లోతు గుంతలు ఉండడంతో అనేక రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా.. పెద్ద సంఖ్యలోనే.. తీవ్రంగా గాయపడిన వాళ్లు ఉన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి రహదారుల్లో ప్రయాణించాలన్నా చాలా దారుణంగా ఉండేవి. ప్రస్తుతం రోడ్ల నిర్మాణం కోసమే ఈ ఏడాది కాలంలో సుమారు రూ.300 కోట్లకు పైనే ఖర్చు చేసింది. తొలుత జిల్లాలో రూ.14 కోట్లకు పైగా వ్యయం చేసి ప్రధానరోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. ఇక జిల్లా వ్యాప్తంగా రూ.244 కోట్లతో సిమెంటు రోడ్లు, రూ.21.45 కోట్లతో తారురోడ్డు పనులు, రూ.23.85 కోట్లతో పనుల పురోగతి, రూ.14 కోట్లతో గుంతల పూడ్చివేత చేపట్టారు.

వాల్మీకిపురం భవనాలకు రూ.3.35 కోట్లు

పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం పట్టణంలో గత పదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన అగ్నిమాపక కేంద్రం, సబ్‌జైలు భవనాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం రూ.3.35 కోట్ల నిధులు మంజూరు చేసింది. సబ్‌జైలుకు రూ.2.50 కోట్లు, అగ్నిమాపక కేంద్రానికి రూ.85 లక్షల నిధులు మంజూరు చేశారు. త్వరలోనే ఈ పనులకు టెండర్లు ఖరారు చేసే అవకాశం ఉంది.



అధ్వానంగా ఉన్న పుల్లంపేట మండలం అప్పయ్యరాజు పేట పంచాయతీ రామక్కపల్లె రోడ్డుపై సిమెంటు రోడ్డు వేసిన దృశ్యం

వైసీపీ పాలనలో అసంపూర్తిగా రోడ్లు

వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు ఆరు నెలలు ముందు గ్రామాలకు లింకు రోడ్లు మంజూరు చేశారు. పల్లెపండుగ తరహాలోనే ఊరు ఎక్కడున్నా.. అక్కడికి వరకు మట్టిరోడ్లను తారు రోడ్డుగా మార్చే పనులు మొదలుపెట్టారు. అందులో భాగంగా మట్టి పనులు చేపట్టి, కంకర వేసి వదిలేశారు. కానీ కూటమి ప్రభుత్వం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారి మూలపల్లె చింతతోపు వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చేశారు. ఇక్కడ ఈ గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతుండేవి.

ములకలచెరువులో ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. మట్టిరోడ్డు కావడంతో కనీసం 108 వాహనం కూడా వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం సిమెంటు రోడ్డు వేయడంతో అటు వాహనాలకు, ఇటు రోగులకు సౌకర్యంగా వుంది. రామసముద్రం మండలం దాసార్లపల్లె ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి మట్టి రోడ్డు కావడంతో స్థానికులతో పాటు పాఠశాల విద్యార్థులు వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు సిమెంటు రోడ్డు వేయడంతో సమస్య పరిష్కారమైంది. సంబేపల్లె మండలం దుద్యాల గ్రామంలో మోటకట్ల- కోటకాడపల్లె మార్గంలో దిన్నెపల్లె బస్సు స్టేజ్ సమీపంలో.. గత వైసీపీ ప్రభుత్వంలో.. కల్వర్టు దెబ్బతింది. ఆ ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఈ కల్వర్టు పనులు పూర్తి చేశారు. అదేవిధంగా పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట పంచాయతీ కడప- చెన్నై రహదారి నుంచి రామక్కపల్లె గ్రామానికి వెళ్లే.. రహదారి పనులు అధ్వానంగా ఉండేవి. 2004లో ఈ రోడ్డుపైన మట్టి వేశారు. 21 ఏళ్ల తర్వాత.. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డును ఏర్పాటు చేశారు.





కలకడ మండలం గంగాపురం పంచాయతీ రంగప్పగారిపల్లెలో మట్టి రోడ్డు, కూటమి ప్రభుత్వం నిర్మించిన సీసీ రోడ్డు

లో-ఓల్టేజీ సమస్య అధిగమించేందుకు మూడు సబ్‌స్టేషన్లు

పీలేరు నియోజకవర్గంలో లో-ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం మూడు కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు చేసింది. పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ పుట్టావాండ్లపల్లె, దొడ్డిపల్లె పంచాయతీ శివరామాపురం, వాల్మీకిపురం మండలం టి.సాకిరేవుపల్లె వద్ద ఒక్కొక్కటి రూ.3.50 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వీటిలో పీలేరు మండలం పుట్టావాండ్లపల్లె వద్ద ఉన్న సబ్‌స్టేషన్ పనిచేస్తుండగా, మిగిలిన రెండు నిర్మాణ దశలో ఉన్నాయి. కొత్త సబ్‌స్టేషన్ల రాకతో నియోజకవర్గంలోని ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే అవకాశం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





గుర్రంకొండ ఇందిరమ్మకాలనీలో సీసీ రోడ్డు వేయక ముందు, సీసీ రోడ్డు వేసిన తరువాత

ఎంతో సౌకర్యంగా ఉంది



జాతీయ రహదారి రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే మట్టి రోడ్డును సిమెంటు రోడ్డుగా వేయడంతో ఎంతో సౌకర్యంగా ఉంది. గతంలో మట్టి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడే వాళ్లం. వర్షం వస్తే.. అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సిమెంటు రోడ్డు వేయడంతో రాకపోకలకు బాగా ఉంది.

- లక్ష్మీదేవి, ములకలచెరువు

గోకులం పూర్తయింది



వైసీపీ ప్రభుత్వంలో గోకులాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. అయితే ఈ ప్రభుత్వం గోకులాల నిర్మాణానికి పెద్ద పీట వేసింది. గోకులాల వల్ల ఆవులకు ఎంతో ఉపయోగం. ఆవులను ఆరుబయట కట్టేయాలంటే.. భయం. దీంతో నేను సుమారు రూ.1,85,000 వ్యయం చేసి గోకులం పూర్తి చేశాను. దీనివల్ల ఎంతో మేలు కలుగుతుంది. ప్రభుత్వం త్వరగా బిల్లులు వేయాలి.

- హరిబాబు, నిమ్మనపల్లె

మామిడి రైతుకు.. సబ్సిడీ కవర్ల పంపిణీ

జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. సాధారణంగా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో.. కాయల దిగుబడి తగ్గేది. అయితే కలెక్టర్ ప్రత్యేక చొరవతో.. సుమారు 50 వేల ఎకరాల్లో సాగులో ఉన్న మామిడి తోటలకు సబ్సిడీతో ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం రూపాయి సబ్సిడీతో ఇచ్చింది. దీనివల్ల ప్రతి రైతూ.. అదనంగా రూ.లక్షకు తక్కువ కాకుండా ఆదాయం పొందుతున్నారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం

ఒంటిమిట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. అందులో భాగంగా బుధవారం జ్యేష్ఠమాసం పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. అంతకు ముందుగా మూల విరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. ముందుగా అర్చకులు విశ్వక్సేనపూజ, కలశ ప్రతిష్ఠ, యజ్ఞోపవిత ధారణ, పట్టువస్త్రాల సమర్పణ, కన్యాదానం కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల మధ్య ఉత్సవ మూర్తులపై జిలకర, బెల్లం అమర్చారు. అనంతరం మాంగళ్యధారణ చేశారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేసి సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జిల్లాలో 20 మంది తహసీల్దార్లకు స్థానచలనం

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 20 మంది తహసీల్దార్లను, 8 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లి తహసీల్దార్‌గా కిశోర్‌కుమార్‌రెడ్డి, కురబలకోట తహసీల్దార్‌గా ధనాంజనేయులు, రైల్వేకోడూరు తహసీల్దార్‌గా అమర్‌నాథ్, సుండుపల్లె తహసీల్దార్‌గా మహబూబ్‌చాంద్, ఓబులవారిపల్లి తహసీల్దార్‌గా యామిని, కలకడ తహసీల్దార్‌గా మహేశ్వరి భాయ్, వీరబల్లి తహసీల్దార్‌గా ఖాజాబీ, చిట్వేలి తహసీల్దార్‌గా స్పందన, నందలూరుకు అమరేశ్వరి, పెద్దమండెంకు తేజస్విని, తంబళ్లపల్లికు శ్రీనివాసులు, పుల్లంపేటకు పుల్లారెడ్డి, సంబేపల్లెకు ఎంవీ సుబ్రమణ్యంరెడ్డి, సబ్ కలెక్టర్ రాజంపేట ఏవోగా శ్రీధర్‌రావు, మదనపల్లె కలెక్టర్ ఏవోగా నిర్మలాదేవి, లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ శ్రీనివాసులును రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కేఆర్‌ఆర్‌సీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. మిగిలిన వాళ్లను రాయచోటి కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

టమోటా రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీ

● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

మదనపల్లెటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంతంలో టమోటా రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, 20 రోజుల్లో ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి ఒక నివేదిక అందిస్తుందని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి ఉద్యాన, వ్యవసాయ, మార్కెటింగ్, పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పలు సందర్భాల్లో టమోటా ధరలు లేక, రైతులు నష్టపోతున్నారని తెలిసి మదనపల్లె పర్యటనకు వచ్చామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమలశాఖ అధికారులతో పాటు వ్యవసాయ నిపుణుడు కోటేశ్వరరావుతో కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. టమోటా సాగులో నష్టాన్ని తగ్గించేందుకు ఈ కమిటీ నివేదికను అందిస్తుందని, ఈ నివేదికను సీఎం చంద్రబాబుకు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి భరత్‌కు నివేదికలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, డ్రిప్ ఇరిగేషన్ అధికారిణి లక్ష్మీప్రసన్న, వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, టమోటా మండి యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, జేకే వర్మ, వ్యాపారులు, మార్కెట్ సెక్రటరీ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, టమోటా వ్యాపారులతో సమీక్ష నిర్వహిస్తున్న లంకా దినకర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

నేడు 2417 మందికి వితంతు పింఛన్ల పంపిణీ

కలికిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన 2417 నూతన వితంతు పింఛన్లను గురువారం జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయనున్నారు. సాధారణ పింఛన్ల మాదిరిగా ఈ కొత్త వితంతు పింఛన్లను కూడా ఇంటింటికీ వెళ్లి అందజేయనున్నారు. ఆయా పంచాయతీల్లో ప్రజా ప్రతినిధులు పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. గతంలో పింఛన్లు తీసుకుంటూ 2023 నవంబరు 1 తేది నుంచి 2024 అక్టోబరు 31వ తేది మధ్యలో చనిపోయిన వారి భార్యలకు కొత్తగా ఈ పింఛన్లను మంజూరు చేశారు.

రాజంపేటలో నిలిచిన సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్

● జెండా ఊపి ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్రంలో సాయిలోకేష్, జగన్‌మోహన్‌రాజు, రమేష్‌నాయుడు తదితరులు

రాజంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి రైల్వే స్టాపింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, రైల్వే గుంతకల్ ఇన్‌చార్జి డీఆర్‌ఎం సుదీపనసింగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తిరుపతి నుంచి నిజాముద్దీన్‌కు వెళ్లే 12707 ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ అధికారికంగా నిలుపుదల ప్రారంభించడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. దేశంలో రైల్వేల అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని, రాజంపేట రైల్వేస్టేషన్‌ను రెండు దఫాలుగా రూ.30 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ మాట్లాడుతూ తన విన్నపాన్ని స్వీకరించి కేంద్ర రైల్వేశాఖ మంత్రి రైలు స్టాపింగ్‌కు అనుమతి ఇచ్చినందుకు రాజంపేట ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. చమర్తి మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వ హయాంలో రాజంపేటలో సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. కాగా అనేక ఏళ్లుగా పూర్తికాని రైల్వే అండర్ బ్రిడ్జిని మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు పరిశీలించారు. వెనువెంటనే ఈ అండర్ బ్రిడ్జిని ప్రారంభించి ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యం కల్పించాలని, ఇందుకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సుధాకర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో జిల్లా అభివృద్ధి

- జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు
- త్వరలో అన్నమయ్య డ్యాం పునర్‌నిర్మాణం
- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- రైతాంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలోనే అన్నమయ్య జిల్లాలో ఊహించని విధంగా ఎనలేని అభివృద్ధి జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన శుభ సందర్భంగా బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి జిల్లా వ్యాప్తంగా 143.81 కోట్లతో పూర్తయిన 1377 పనుల ప్రారంభోత్సవం, రూ.81.53 కోట్లతో 255 నూతన పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే కనీవిని ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామన్నారు. ఆయన 24 గంటలు పనిచేస్తూ, ఆయనతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలతో కూడా పనిచేయించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. అదేవిధంగా వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు.

గత ప్రభుత్వంలో గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయాలంటే అప్పటి పాలకులు ఎన్నో ఇబ్బందులు పడేవారని, కేవలం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రతి గ్రామంలో రూ.15 లక్షల పైచిలుకు నిధులు ఖర్చు చేసి సిమెంటు రోడ్డు వేశామన్నారు. ఇందులో భాగంగా దీపం-2 పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేద మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు, 1వ తేది ఆదివారం వస్తే ఒక రోజు ముందే ఇంటింటికి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడంతో అందరికీ మేలు జరిగిందన్నారు. జల్‌జీవన్ పథకం ద్వారా రూ.1800 కోట్లతో రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి కుళాయి కనెక్షన్ ఇప్పించి మంచినీరు సరఫరా చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల తెగిన అన్నమయ్య ప్రాజెక్టును పునర్‌నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. ఏడాదిగా జిల్లా వ్యాప్తంగా 143.81 కోట్లతో పూర్తయిన 1377 పనుల ప్రారంభోత్సవం, రూ.81.53 కోట్లతో 255 నూతన పనులకు మంత్రివర్యుల చేతుల మీదుగా శంకుస్థాపన చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ పట్ల విశ్వసనీయత పెంచాలి

● మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి ● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని, మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. అంతేగాక మత్తు పదార్థాల విక్రయాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పరిష్కారానికి చొరవ చూపాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నేర నిరూపణలకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నేర పరిశోధన చేయాలని, పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలు జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వద్ద కలిగే అనర్థాలపై యువత, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రధానంగా మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాజంపేట మున్సిపల్ కమిషనరుపై విచారణకు ఆదేశాలు

కలికిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న బి.నాగేశ్వరరావుపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటీసులు అందచేసింది. నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు రాజంపేట మున్సిపల్ కమిషనరుగా డెప్యుటేషన్‌పై వచ్చారు. ఆయన పనితీరుపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందడం, మున్సిపాలిటీ పాలనను గాలికి వదిలేయడం, మున్సిపల్ రెవెన్యూ అభివృద్ధికి ప్రయత్నించకపోవడం, పారిశుధ్యం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం గత ఫిబ్రవరి 17న ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై నాగేశ్వరరావు ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోవడంతో మున్సిపల్ పరిపాలన కమిషనరు తదుపరి చర్యలకు మే 12న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం నాగేశ్వరరావుపై విచారణ చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు బుధవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపైన ఆయన 15 రోజులలోగా వివరణలు సమర్పించుకోవాలని ఆదేశించింది. ఆయనపై మోపిన అభియోగాల జాబితాలను కూడా దీనికి జతచేస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


పవన్‌కుమార్ మృతదేహం

ఎర్రగుంట్ల, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రకాష్‌నగర్ 5వ వీధికి చెందిన దాసరి పవన్‌కుమార్ (20) బుధవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పవన్‌కుమార్ ప్రొద్దుటూరు లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సెకండియర్ పూర్తి చేశాడు. సెల్‌ఫోన్ అతిగా చూస్తున్నాడని తండ్రి సుధాకర్ మందలించడంతో మనస్థాపం చెందాడు. మంగళవారం రాత్రి తల్లిదండ్రులు ఇంటి బయట నిద్రిస్తుండగా పవన్ ఇంట్లో పడుకున్నాడు. పనికి వెళ్లేందుకు సుధాకర్ తెల్లవా రుజామున తలుపు తెరవమని పిలువగా ఎంతకీ తెరవలేదు. దీంతో తలుపు పగలగొట్టి చూడగా పవన్‌కుమార్ రేకుల పైప్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదం డ్రులు బోరున విలపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో మంగళవారం రాత్రి షేక్ మహబూబ్‌బాష (59) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు జమ్మలమడుగు పట్టణంలో కూలి పనులు చేసుకుని జీవిం చేవాడు. ఈయనకు నలుగురు సంతానం. అందులో వివిధ కారణాలతో ఇద్దరు మృతి చెందారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. ఈయన మృతికి గల కారణాలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

యువకుడి కిడ్నాప్.. కేసు నమోదు

కలకడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తన కొడుకును కిడ్నాప్ చేశారంటూ షేక్ కౌసర్ అనే మహిళ ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేర కు.. కలకడకు చెందిన సయ్యద్ అలీ నాలుగేళ్ల క్రితం తన చెల్లెలిని రాయ చోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం చేశాడు. కొంత కాలానికి ఖాజా కొంత మొత్తాన్ని అత్తింటివారికి అప్పుగా ఇచ్చాడు. రుణం చెల్లించాలంటూ పలుమార్లు అడిగినా, వారు స్పందించకపోవడంతో తన సొమ్ము రాబట్టుకోవడంలో భాగంగా వెల్డింగ్ పనులు చేసుకుంటున్న బావమరిది కుమారుడు తౌనిక్ అలీ(22)ని మంగళవారం కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు బాధితుడి తల్లి షేక్ కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వివరించారు.

వందేళ్ల బామ్మ తోట రంగమ్మ మృతి


తోట రంగమ్మ మృతదేహం


ఆంధ్రజ్యోతిలో తనపై వచ్చిన కథనాన్ని చదువుతున్న రంగమ్మ (ఫైల్)

రాజంపేట, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): పెనగలూరు మండలం నారాయణనెల్లూరు గ్రామానికి చెందిన వందేళ్ల బామ్మ తోట రంగమ్మ బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమె నెల రోజుల కిందట బాత్‌రూంకు వెళ్లి జారి కింద పడడంతో కాలికి గాయమైంది. అప్పటి నుంచి ఆమె నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై అనారోగ్యానికి గురైంది. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె మనవడు తోట సాయిరాం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు వందేళ్లగా ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆమె ఉంటూ ఆదర్శప్రాయంగా ఉండేది. సుమారు 12 మంది సంతానాన్ని కలిగి ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండేది. ఈవిషయమై ఈ యేడాది ఫిబ్రవరి 16వ తేదీ బామ్మ భళా అనే శీర్షికన ఆమె ఆరోగ్యంతో కూడిన ఫొటోలను, ఆరోగ్య జీవిత విశేషాలను కథనం ద్వారా ప్రచురించడం జరిగింది. కథనం ప్రచురించిన తర్వాత ఆమె ఎంతో సంబరపడేది. తన ఫొటోతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని తన బంధువులకు అందరికి చూపుతూ ఆనందపడేది. ఇంతలో ఆమె బాత్‌రూంలో కిందపడం, అనారోగ్యానికి గురై మృతిచెందడం జరిగింది. ఈమె దహన క్రియలను గురువారం ఉదయం 9 గంటలకు ఆమె స్వగ్రామం నారాయణ నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడ్డ సృజన (ఫైల్‌ఫొటో)

- ప్రేమ పేరుతో వేధింపులే కారణం
- ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా తన ప్రేమను ఇంట్లో చెప్తే తండ్రిని చంపేస్తానని భయపెట్టడంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టావాండ్లపల్లెలో చోటు చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు వివరాలిలా.. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మిట్టావాండ్లపల్లిలో బేల్దారిగా జీవనం సాగిస్తున్న చంద్రగిరి ఉత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కూతురు సృజన (15) ఇటీవల పదవ తరగతిలో 554 మార్కులు సాధించింది. రాయచోటి పట్టణంలోని రాజు ఐఐటీ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సృజన ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చింది. ఏం జరిగిందని తండ్రి ప్రశ్నించగా "తారక రత్న నిన్ను చంపేస్తాడంట. నాకు భయంగా ఉందినాన్న" అని చెప్పింది. ఎందుకు చంపుతాడని ప్రశ్నించగా.. తనను ప్రేమ పేరుతో తారకరత్న వేధిస్తున్నాడని, ఇంట్లో వాళ్లకు చెబుతానని హెచ్చరిస్తే అందుకు మీ నాన్నను కూడా చంపుతానని బెదిరించాడని అన్నారు. ఈ విషయం తారకరత్న తల్లిదండ్రులకు చెప్పి సమస్య పరిష్కరించుకుందామని అనుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిల్లలంతా ఇంటిముందు ఆడుకుంటుండగా సృజన ఇంట్లోకి హడావిడిగా వచ్చి తారకరత్నతో తనకు భయమేస్తోందని చెప్పి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఎంతకూ బాలిక గడియ తీయకపోవడంతో తల్లిదండ్రులు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో సీలింగ్ కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. వెంటనే సృజనను కిందకు దించి ఆటోలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చనిపోయిందని చెప్పారు. ప్రేమ పేరుతో వేధించి, భయపెట్టి తమ కుమార్తె చావుకు కారణమైన తారకరత్నపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఉత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలియజేశారు. కాగా.. బాలికను వేధించిన తారకరత్న బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

నెల్లూరు, కడప జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, కడప జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో భువనేశ్వర్ 63 పరుగులు చేశారు. అనంతరం నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు ఉపక్రమించగా వర్షం రావడంతో టార్గె ట్‌ను 45 ఓవర్లకు 224 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో బ్యాటిం గ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో కారుణ్యప్రసాద్ 50 పరుగులు చేశారు. ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. ఇందులో మురారి హృదయ్ 66 పరుగులు చేశారు. అనంతరం కడప జట్టు బ్యాటింగ్‌కు దిగిన సమయంలో వర్షం రావడంతో టార్గెట్‌ను 37 ఓవర్లలో 164 పరుగులకు కుదించారు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 30.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో రోహిత్ వర్మ 68 పరుగులు, రణధీర్‌రెడ్డి 55 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ కొత్త బస్సు పాసులు

కడప మారుతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారం భం కావడంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ కొత్త బస్ పాసులను ఈనెల 14వ తేదీ శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలి పారు. బస్సు పాసులు పొందగోరు విద్యార్థులు తమ వివ రాలను ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా జెనరేటైన పిన్ నెంబర్ కౌంటర్‌లో తెలిపినచో బస్సు పాస్ కొరకు క్యూలైన్‌లో వేచి వుండే సమయం తగ్గుతుందన్నారు నమోదు ప్రక్రియ మొబైల్ ఫోన్ ద్వారా కూడా సులభంగా చేసుకునే వెసులు బాటు కలదన్నారు. విద్యార్థులు గమనించి సులభరీతిలో బస్సు పాస్ పొందాలని కోరారు. కాగా ఈనెల 12, 13 తేదీలలో ఆయా బస్టాండ్‌ల వద్ద గల బస్సు పాస్ కౌంటర్లకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్షలు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం, కేఓఆర్ఎం, స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి సెంటర్ వద్ద ఒక సీఐతో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

పోలీసులపై తిరగబడిన యువకులు...?!

గుర్రంకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రికార్డింగ్ డ్యాన్స్ ప్రదర్శ నకు పోలీసులు ఎందుకొచ్చారు. మా గ్రామంలోకి అడుగు పెట్టడానికి ఎవరు అనుమతించారంటూ గెరికుంటపల్లెకు చెందిన కొందరు యువకులు పోలీసులపై రెచ్చిపోయి దాడికి యత్నిం చారు. కొంతమంది ఆకతాయిలు పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావ రణం ఏర్ప డింది. పోలీసులు, యువకుల మధ్య వాగ్వాదం జరుగుతుండగా ఇద్దరు యువకులు పోలీస్ జీప్‌పై రాళ్లు విసి రారు. దీంతో అద్దం ధ్వంసం కావడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈక్రమంలో గ్రామస్థులు అల్లరిమూకలకు మద్దతుగా పోలీసులను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మండలంలోని నడిమికంద్రిగలో పోలేరమ్మ జాతర సందర్భంగా మంగళవారం రాత్రి గెరికుంటపల్లెలో చాందినీ బండి ముందు హిజ్రాలతో డ్యాన్స్ చేయించేందుకు కొందరు యువకులు సిద్ధపడ్డారు. వారి ప్రయత్నాలను అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన కొందరు యువకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. దుర్భాష లాడుతూ దాడికి యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు పోలీసు జీపుపై రాళ్లు విసిరారు. దీంతో జీప్ అద్దం ధ్వంసమైంది. పోలీసులు అల్లరిమూకలను చెదరకొట్టడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, జీప్ అద్దం ధ్వంసం కావడానికి కారణమైన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలి పారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో పోలీసులపై తిర గబడిన యువకులను అదుపులోకి తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. దీంతో వారు పరారైనట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

ఆలయానికి రూ.52,116 వితరణ

నందలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి తుమ్మల(నామాల) శేషయ్య, కమలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ జడ్పీటీసీ వెంకటమణి, కుటుంబసభ్యులు కలిసి రూ.52116 ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు దాతను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


చిన్నకొమెర్ల గ్రామ పొలాల్లో ఏరువాక పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

మైలవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే కూటమి ధ్యేయమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని చిన్నకొమెర్ల గ్రామ పొలాల్లో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు రైతులతో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సేద్యపు పనులను పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఏరువాక పండుగ రైతు జీవితానికి ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడాలని, పంటలు బాగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, రైతుల జీవితాల్లో ఆనందం వెల్లువిరియాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సురెన్స్ త్వరలో అందుతుందన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేలను అందిస్తుందని...మొదటి విడతగా రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌రెడ్డి, డీఆర్‌సీ ఏవోలు పద్మజ, శైలజ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఏవోలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయరావు, కూటమి నాయకులు చెన్నకేశవరెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేఎస్ఆర్ఎం కళాశాల 8వ స్నాతకోత్సవం



కేఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో పాల్గొన్న కేఎస్ఆర్ఎం ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి, తదితరులు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య ఉన్నత భవిష్యత్తుకు పునాది అని శ్రీహరికోట ఇండియన్ సైంటిస్ట్, మాజీ డైరెక్టర్ పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల 2021-25 బ్యాచ్ విద్యార్థుల 8వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో సమాజంవైపు అడుగులు వేసేందుకు చట్టభద్రత అనేది ఒక ముఖ్య ఘట్టమని, అపరిమిత అవకాశాలకు అనితర సాధ్యాలకు ప్రారంభమని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. మరో అతిథి అనంతపురం జేఎన్‌టీయూ అకడమిక్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యలో ముందుండడంతోపాటు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ జీవిత ప్రయాణానికి, రేపటి ప్రపంచానికి, ఆవిష్కరణలకు రాయబారులుగా, నాయకులుగా ఎదగాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కొత్త జాతీయ విద్యావిధానం ద్వారా 2020 నుంచి అమలు చేస్తూ విద్యార్థులను ఉత్తమ అధ్యాపకులతో తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాను బ్రాంచ్‌ల వారీగా అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌ఛైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాదు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు


రికవరీ చేసిన ఆభరణాలను చూపుతున్న టూటౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మార్చి 15న జరిగిన దొంగతనాన్ని టుటౌన్ పోలీసులు ఛేధించి ఆభరణాలను రికవరీ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టుటౌన్ సీఐ సదాశివయ్య వివరాలు వెల్లడించారు. మార్చి 15న గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంటిలో 249 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ కేసుకు సంబంధించి చోరీకి పాల్పడిన జంగా వెంకట్రావు, సుధాకర్‌లను ఇతర జిల్లా పోలీసులు అరెస్టు చేశారన్నారు. వారిని పీటీ వారెంట్‌తో కోర్టులో హాజరుపరచి కస్టడిలోకి తీసుకుని చోరీకి సంబంధించిన ఆభరణాలు రికవరీ చేశామన్నారు. చోరీ అయిన ఆభరణాల్లో కొన్ని అమ్మి సొంత ఖర్చులకు ఉపయోగించుకోగా మిగిలిన ఆభరణాలను బద్వేలు టౌన్ దాటిన తర్వాత అటవీ ప్రాంతంలో దాచి పెట్టారన్నారు. దాదాపు 180 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. అలాగే చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీకి సంబంధించిన ఆభరణాలు రెండు రికవరీ చేశామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ భావన ఆదేశాల మేరకు రికవరీ కోసం కృషి చేసిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి.. దళిత సంఘాల ఆందోళన

పీలేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన టీడీపీ నేతను వెంటనే అరెస్టు చేయాలని పీలేరులోని దళిత సంఘాలు బుధవారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశాయి. వారి కథనం మేరకు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా, టీడీపీ నేత పులిచెర్ల మహేశ్ దారికి అడ్డంగా కారు నిలిపాడు. దీంతో కారును పక్కకు పెట్టాలని ధరణి సూచించాడు. దీంతో కారును పక్కకు తీయకపోగా, ధరణిపై దాడి చేయడమే కాకుండా, ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది, వైద్యులను దూషించాడు. ఈ విషయంపై బుధవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టిం చుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. మహేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ యుగంధర్ దళిత సంఘాల నేతలతో ఫోనులో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకుంటా మని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ధరణీకుమార్‌ను పీలేరు ఆసు పత్రిలోని పారిశుధ్య, ఇతర విభాగాల సిబ్బంది పరామర్శించి సంఘీభావం తెలిపారు.

తహసీల్దారుగా అమరేశ్వరి బాధ్యతల స్వీకరణ



నందలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారుగా అమరేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో కడప జిల్లా మైదుకూరులో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేశారు. పదోన్నతిపై నందలూరుకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు వి.పుల్లారెడ్డి నూతన తహసీల్దారుకు బాధ్యతలు అప్పజెప్పి పుల్లంపేట తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు.

ఒంటిమిట్ట తహసీల్దారుగా దామోదర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదర్‌రెడ్డి

ఒంటిమిట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండల తహసీల్దారుగా డి.దామోదర్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం సాయంత్రం స్థానిక కోదండరామాలాయన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మంగారి మఠం తహసీల్దారుగా పనిచేస్తున్న దామోదర్‌రెడ్డి ఒంటిమిట్టకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు రమణమ్మ ఖాజీపేటకు బదిలీపై వెళ్లారు. డీటీ గౌరి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి,వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పుల్లంపేట తహసీల్దారుగా పుల్లారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న పుల్లారెడ్డి

పుల్లంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట తహసీల్దారుగా వి.పుల్లారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నందలూరు తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై పుల్లంపేటకు వచ్చారు. పుల్లంపేట తహసీల్దారుగా పనిచేస్తున్న అరవిందకిశోర్‌ను బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వలేదు.

విత్తనాలు, ఎరువులు అందజేయాలి

రామాపురం,జూన్11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు కావాల్సి విత్తనాలు, ఎరువులు రైతులకు 90 శాతం సబ్సిడీతో అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రం గారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బీదవాండ్లపల్లెలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎద్దులబండితో రైతు శంకరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజు, చిన్నరాయుడు, నాగమణి, నాగేంద్ర, మరికొంత మంది రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టండి

గాలివీడు, జూన్11(ఆంధ్రజ్యోతి): గాలివీడు మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎంఈవో నాగరాజుకు ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు యూనిఫాం, బుక్స్ అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. కావున జిల్లా విద్యా ఉన్నతాధికారులు స్పందించి పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ప్రపంచ బాలల ఆటల దినోత్సవం

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మార్కెట్ వీధిలో గల మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో బుధవారం ప్రపంచ బాలల ఆటల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుగుణ, రాయచోటి సెక్టార్ సూపర్‌వైజర్ సుగుణ, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సమీవుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుగుణ మాట్లాడుతూ పిల్లల్లో ఆటల ద్వారా శారీరక అభివృద్ధి మెరుగుపడుతుందని, ఆటల పాటల ద్వారా పిల్లలు విద్యను సులభతరంగా నేర్చుకుంటారన్నారు.

మహా సభలను విజయవంతం చేయాలి

రైల్వేకోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కనుపర్తి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సీ. పుల్లయ్య లు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

రక్తదాత వేణుకు పురస్కారం

చిట్వేలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదాత వేణుకు అత్యుత్తమ పురస్కారం దక్కనుంది. చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ 110 పర్యాయాలు రక్తదానం చేసినందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. రాష్ట్ర గవర్నర్ అధ్యక్షుడిగా ఉన్న ఈ సంస్థ ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గుంటూరులో జరిగే కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్ పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు సంస్థ సీఈవో ప్రధాన కార్యదర్శి ఎ.కె పరీడా ద్వారా కడప జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా బుధవారం డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ నుంచి అత్యున్నత పురస్కారం అందుకోవడం తన జీవితంలో గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ కర్తవ్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆర్అండ్ఆర్ కాలనీలో మోటారును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం,జూన్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం మండిపల్లి నాగిరెడ్డి ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించి గతంలో వేసిన బోరుకు మోటారు బిగించి కుళాయిల ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ ప్రజలు గతంలో నీటి సమస్యతో ఇబ్బందిపడేవారని దులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నూతన బోర్లు వేసి పైపులైన్ ద్వారా నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. మండిపల్లి నాగిరెడ్డి రిజర్వాయర్ ద్వారా నియోజకవర్గంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పడమటికోన గ్రామం తొగటపల్లిలో, బలిజపల్లెలో సీసీ రోడ్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత ప్రారంభించారు.

మౌలిక వసతుల ఏర్పాటే లక్ష్యం

సంబేపల్లె, జూన్11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, తాగునటి వసతి, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణరెడ్డిగారిపల్లె పంచాయతీలోని ఎర్రగుంట్లలో 15 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం, జూన్11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నేత మండిల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం గువ్వలచెరువు కాలనీలో బోరు వేయించి పైపులను ఏర్పాటు చేసి నీరందించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన చీకటి రామప్పనాయుడు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. హరినాథ్, అజీమ్, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు. అనంతరం ఇరుగులమ్మ దేవాలయంలో పూజలు చేశారు.

రైల్వేకోడూరును అభివృద్ధి చేయడమే లక్ష్యం



శెట్టిగుంటలో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామ పంచాయతీ కేంద్రంలో రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధి లేక వెనుకబడి ఉన్న సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదు మండలాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతన్నాయన్నారు. రాబోవు నాలుగేళ్లలో రైల్వేకోడూరును రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపు తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా డీసీఎంస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, నాగినేని వెంకటరమణ, చంద్రశేఖర్, కొమ్మా శివ, ఉప సర్పంచ్ కంచిరాజు రామరాజు, శేఖర్. గడికోట సుబ్బరాయుడు, పీఆర్ డీఈ బాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముక్కా

ఓబులవారిపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పాల్గొన్నారు. ముదినేపల్లె వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నఓరంపాడు పంచాయతీ పరిధిలోని కుటుంబాలకు తాగునీటి బోరుకు భూమిపూజ చేశారు. అలాగే యల్లాయపల్లె పంచాయతీలో తాగునీటి మోటారు పైపుల అనుసంధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల కోసం నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఆయా శాఖల అధికారులు, టీడీపీ సీనియర్ నాయకుడు పున్నాటి వాసుదేవరెడ్డి, ముక్కా సాయివిశాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వల్లి, పుల్లగంటి చంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పెనగలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ముద్రపల్లెలో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రూ.15లక్షల వ్యయంతో నిర్మించే సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి దామోదర్‌నాయుడు, కాకర్ల నాగేశ్వరనాయుడు, డి.సుదర్శన్‌చౌదరి, కె.బాలక్రిష్ణ, కె.కళాచంద్ర, ముద్రపల్లె మాజీ సర్పంచ్ బాబు, మాజీ ఎంపీటీసీ అబ్బయ్యనాయుడు, కె.సురేష్‌రెడ్డి, ఎంపీడీవో విజయరావు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోండి



వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గాలివీడు, జూన్11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పార్థసారధిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పూలకుంట సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలు బేబీ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి, ప్రభాకర్‌నాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేశ్, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి, భూత్ ఇన్‌చార్జి శివశంకర్, బిందు సేద్యపు సిబ్బంది రమేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : సబ్సిడీ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకురాలు జయరాణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రమేశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు కవిత, ప్రభంజని, స్థానిక టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, అంజనారెడ్డి, శివారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పుల్లంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేటలోని పర్వతవర్ధినిదేవి శాంలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. కల్యాణం నిర్వహించేందుకు పూలతో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల మధ్య కల్యాణమండపానికి తీసుకువచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పుల్లంపేట పరిసర గ్రామాల ప్రజలు అదిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలకు పుల్లంపేట పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

రీ సర్వేతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు: కమిషనర్



మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాజంపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పురపాలక సంఘం పరిధిలో జరుగుతున్న రీసర్వే కొలతల వల్ల పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటివద్దకు సర్వే కోసం వస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు పట్టణంలో ఉన్న 11473 ఇళ్ల(అసైన్మెంటు) రీసర్వే చేపడుతున్నామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఉన్న రికార్డుల ప్రకారం ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న ఇంటి రికార్డుల కొలతలు సమానంగా ఉన్నాయా లేవా అని, వ్యత్యాసం ఉన్న ఇళ్ల కొలతలను మాత్రమే రికార్డులో పక్కాగా నమోదు చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రస్తుత రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో ఉన్న రికార్డులు చాలా వరకు వ్యత్యాసం ఉన్నాయన్నారు. రీసర్వే కొలతల వల్ల ప్రజలకు పన్నులు కూడా పెరగవన్నారు. రికార్డులు సరి చేసుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. ప్రజలు అపోహలు వీడి మున్సిపల్ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. రెవెన్యూ అధికారులు, 13వ వార్డు సచివాలయ పరిపాలన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని రైతులందరూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ సారి వర్షాలు బాగా కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు ఆయా నేల స్వభావాన్ని బట్టి ఏయే పంటలు సాగు చేయాలి అనే అంశాలపై సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

లాడ్జి తనిఖీ - అదుపులోకి మద్యం బాబులు

ఒంటిమిట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట సమీపంలోని లాడ్జీని తనిఖీ చేసినట్లు సీఐ బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం గ్యాంబ్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు లాడ్జీని తనిఖీ చేశారన్నారు. కాని లాడ్జీలో కొంతమంది మద్యం సేవిస్తున్నారని, వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నేతలు

రాజంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మామిడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని బుధవారం బోయనపల్లె మార్కెట్‌యార్డులో రైతులు నిరసన తెలిపారు. ఈమేరకు రైతు సంఘం జిల్లా నాయకుడు పందికాళ్ల మణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రైవేటు మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు దాదాపు 200 వరకు ఉన్నాయన్నారు. చిత్తూరు కలెక్టర్, యాజమాన్యం, రైతు సంఘాలతో చర్చలు జరిపినా ప్రయోజనం లేదన్నారు. అన్నిరకాల సరుకుల ధరలు పెరిగినప్పటికీ మామిడి ధరలు మాత్రం తగ్గించడం దారుణమన్నారు. ఈ విదానానికి కట్టడి వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు హరిప్రసాద్, బొజ్జ శివయ్య, వివిధ గ్రామాల మామిడి రైతులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు కోసం వినతి

సుండుపల్లె, జూన్11(ఆంధ్రజ్యోతి): పీలేరు నుంచి సుండుపల్లె-సానిపాయి మీదుగా వీరబల్లికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాముకు బుధవారం వినతి పత్రం అందజేసినట్లు జనసేన నాయకుడు రామాశ్రీనివాస్ తెలిపారు. సుండుపల్లె మండల కేంద్రం నుంచి పక్కనే ఉన్న వీరబల్లి మండలానికి బస్సు సౌకర్యం లేక రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

మోహినీ అలంకారంలో వేంకటేశ్వర స్వామి



చిట్వేలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేఎస్ అగ్రహారంలో వెలసిన మహిమాన్విత క్షేత్ర భూనీల సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం మోహిని తిరుక్కోలం అలంకారంలో అలంకరించి అగ్రహారం నుంచి చిట్వేలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై స్వామివారిని అలంకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చెట్లూరి శేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడండి: బీజేపీ

రైల్వేకోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తులను కాపాడాలని బీజేపీ సీనియర్ నాయకులు గంగరాజు వెంకట్రామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సాయం శ్రీధర్, మాజీ రాష్ట్ర హార్టికల్చర్ కన్వీనర్ తోట శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రైల్వే స్టేషన్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ఉన్న గ్రానైట్ బండలు, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లను కొందరు కావాలనే పగులగొడుతున్నారన్నారు. అలాగే రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వే ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బీజేపీ నాయకులు వాకచర్ల సుబ్బారావు, కాలప్పగారి రాము, కుప్పాల కిరణ్, జ్యోతి, సాయి ఆచారి, వెంకటసుబ్బయ్య, మహేష్, సుమంత్, జ్ఞానేశ్వర్, బత్తల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మహిళలకు వైసీపీ క్షమాపణ చెప్పాలి: టీడీపీ

రైల్వేకోడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలకు వైసీపీ క్యాడర్ క్షమాపణ చెప్పాలని టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి మహిళలను కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు వ్యభిచారులు అని మాట్లాడడం అమానుషం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్కడి భూములను అక్రమంగా లాక్కోలేదని, రైతులు స్వచ్ఛందంగానే భూములు ఇచ్చారన్నారు. అమరావతి మహిళలు వేశ్యలని మాట్లాడడం క్షమించరానిదన్నారు. వెంటనే వైసీపీ నాయకులు క్షమాపణ చెప్పకపోతే మాత్రం చర్యలు తప్పవని తెలిపారు.


ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ద్విచక్రవాహనదారులకు సూచనలు ఇస్తున్న సుబ్బరాయుడు, అనిల్‌కుమార్

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎంవీఐ సుబ్బరాయుడు, అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని చిత్తూరు రోడ్డు జంక్షన్‌లో ద్విచక్రవాహనదారులకు రోడ్డు భద్రత అవాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ప్రాముఖ్యత, రోడ్డు సిగ్నల్స్ వాడకం, ఇతర రోడ్డు భద్రతా జాగ్రత్తలను ద్విచక్రవాహనదారులకు తెలిపారు. హెల్మెట్ ఉపయోగించకుండా సరైన పత్రాలు లేకుండా, అతి వేగంగా, ట్రిపుల్ రైడింగ్ చేసినందుకు విధించాల్సిన జరిమానాలను కూడా వివరించారు. మోటారు ఇన్స్‌పెక్టర్లు అజయ్‌కుమార్, అసిస్టెంట్ మోటారు వెహికల్స్ ఇన్స్‌పెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ హోమ్ గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

యోగా వల్ల వ్యాధులు నయం చేసుకోవచ్చు



యోగాసనాలు చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రాజంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):యోగా వల్ల వ్యాధులు నయం చేసుకోవచ్చు అని ఆయుష్ డిపార్టుమెంట్ రాజంపేట బృందం యూనియన్ మెడిసిన్ డాక్టర్ కె.జవహర్‌జాన్, యోగా శిక్షకులు కె.ప్రసన్న అన్నారు. బుధవారం స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన యోగాలో వారు పాల్గొన్నారు. అధ్యాపకులకు, విద్యార్థులకు పలురకాల ఆసనాలు వేయించారు. వాటి శిక్షణకు సూచనలు అందజేసి ఏయే ఆసనం చేస్తే ఎలాంటి ఆరోగ్య లాభాలు ఉంటాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి వై.ప్రదీప్‌కుమార్, ఇతర అధ్యాపక, ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొనడంతో కళాశాల యాజమాన్యం కార్యదర్శి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డిలు అభినందించారు.

రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి పదవిని బలిజలకే ఇవ్వాలి

● బలిజల ఆత్మీయ సమావేశంలో పలువురు నేతల డిమాండ్



మాట్లాడుతున్న బలిజ సంఘ నాయకులు

రాజంపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ఆవిర్భావం నుంచి రాయలసీమలో రాజంపేట నియోజకవర్గ పదవిని బలిజలకే ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే పద్ధతిని కొనసాగించాలని పలువురు బలిజ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాజంపేట రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన బలిజ సంఘ నేతల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి రాజంపేట నియోజకవర్గంలో రత్నసభాపతి కాలం నుంచి నేటి వరకు బలిజలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇతర నియోజకవర్గాల నాయకులకు నాయకత్వం ఇవ్వడం వల్ల ఓడిపోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బలిజలు అత్యధికంగా ఉన్నారని, వారి మనోభావాలను గుర్తించి ఇన్‌చార్జి పదవి బలిజలకే ఇవ్వాలన్నారు. వైసీపీ నాయకులను ఎదుర్కోవాలంటే బలమైన సామాజిక వర్గమైన బలిజలకే నాయకత్వ బాధ్యతలు ఇవ్వాలన్నారు. త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు జరగనున్నందున తెలుగుదేశంపార్టీ తరఫున బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి నాయకత్వం ఇవ్వకపోతే గెలవడం కష్టమన్నారు. కాపు కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత మోదుగుల పెంచలయ్య, మన్సూరు నాయకులు, అత్తిరాల దేవస్థానం మాజీ చైర్మన్ బండారు బాలయ్య, బలిజ సంఘం సీనియర్ నాయకుడు పోకల ప్రభాకర్, టీడీపీ యువ నాయకుడు గుణకల చిన్నా, బలిజ సంఘం మాజీ నాయకుడు చీనేపల్లె చెంగయ్య, యువ నాయకుడు మన్సూరు విజయ్, నందలూరు నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట మున్సిపల్ కమిషనరుపై విచారణకు ఆదేశాలు

కలికిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపల్ కమిషనరుగా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న బి.నాగేశ్వరరావుపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం నోటీసులు అందచేసింది. నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు రాజంపేట మున్సిపల్ కమిషనరుగా డెప్యుటేషన్‌పై వచ్చారు. ఆయన పనితీరుపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందడం, మున్సిపాలిటీ పాలనను గాలికి వదిలేయడం, మున్సిపల్ రెవెన్యూ అభివృద్ధికి ప్రయత్నించకపోవడం, పారిశుధ్యం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం గత ఫిబ్రవరి 17న ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. దీనిపై నాగేశ్వరరావు ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేకపోవడంతో మున్సిపల్ పరిపాలన కమిషనరు తదుపరి చర్యలకు మే 12న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం నాగేశ్వరరావుపై విచారణ చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు బుధవారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపైన ఆయన 15 రోజులలోగా వివరణలు సమర్పించుకోవాలని ఆదేశించింది. ఆయనపై మోపిన అభియోగాల జాబితాలను కూడా దీనికి జతచేస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



పవన్‌కుమార్ మృతదేహం

ఎర్రగుంట్ల, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రకాష్‌నగర్ 5వ వీధికి చెందిన దాసరి పవన్‌కుమార్ (20) బుధవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. పవన్‌కుమార్ ప్రొద్దుటూరు లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సెకండియర్ పూర్తి చేశాడు. సెల్‌ఫోన్ అతిగా చూస్తున్నాడని తండ్రి సుధాకర్ మందలించడంతో మనస్థాపం చెందాడు. మంగళవారం రాత్రి తల్లిదండ్రులు ఇంటి బయట నిద్రిస్తుండగా పవన్ ఇంట్లో పడుకున్నాడు. పనికి వెళ్లేందుకు సుధాకర్ తెల్లవారుజామున తలుపు తెరవమని పిలువగా ఎంతకీ తెరవలేదు. దీంతో తలుపు పగలగొట్టి చూడగా పవన్‌కుమార్ రేకుల పైప్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య




జమ్మలమడుగు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో మంగళవారం రాత్రి షేక్ మహబూబ్‌బాష (59) అనే వ్యక్తి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మృతుడు జమ్మలమడుగు పట్టణంలో కూలి పనులు చేసుకుని జీవిం చేవాడు. ఈయనకు నలుగురు సంతానం. అందులో వివిధ కారణాలతో ఇద్దరు మృతి చెందారు. ఒక కుమారుడు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు. ఈయన మృతికి గల కారణాలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

యువకుడి కిడ్నాప్.. కేసు నమోదు

కలకడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తన కొడుకును కిడ్నాప్ చేశారంటూ షేక్ కౌసర్ అనే మహిళ ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేర కు.. కలకడకు చెందిన సయ్యద్ అలీ నాలుగేళ్ల క్రితం తన చెల్లెలిని రాయ చోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం చేశాడు. కొంత కాలానికి ఖాజా కొంత మొత్తాన్ని అత్తింటివారికి అప్పుగా ఇచ్చాడు. రుణం చెల్లించాలంటూ పలుమార్లు అడిగినా, వారు స్పందించకపోవడంతో తన సొమ్ము రాబట్టుకోవడంలో భాగంగా వెల్డింగ్ పనులు చేసుకుంటున్న బావమరిది కుమారుడు తౌనిక్ అలీ(22)ని మంగళవారం కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు బాధితుడి తల్లి షేక్ కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వందేళ్ల బామ్మ తోట రంగమ్మ మృతి



తోట రంగమ్మ మృతదేహం



ఆంధ్రజ్యోతిలో తనపై వచ్చిన కథనాన్ని చదువుతున్న రంగమ్మ (ఫైల్)

రాజంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం నారాయణనెల్లూరు గ్రామానికి చెందిన వందేళ్ల బామ్మ తోట రంగమ్మ బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమె నెల రోజుల కిందట బాత్‌రూంకు వెళ్లి జారి కింద పడడంతో కాలికి గాయమైంది. అప్పటి నుంచి ఆమె నడవలేని స్థితిలో మంచానికే పరిమితమై అనారోగ్యానికి గురైంది. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించి బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె మనవడు తోట సాయిరాం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు వందేళ్లుగా ఎటువంటి అనారోగ్యం లేకుండా ఆమె ఉంటూ ఆదర్శప్రాయంగా ఉండేది. సుమారు 12 మంది సంతానాన్ని కలిగి ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండేది. ఈవిషయమై ఈ యేడాది ఫిబ్రవరి 16వ తేదీ బామ్మ భళా అనే శీర్షికన ఆమె ఆరోగ్యంతో కూడిన ఫొటోలను, ఆరోగ్య జీవిత విశేషాలను కథనం ద్వారా ప్రచురించడం జరిగింది. కథనం ప్రచురించిన తర్వాత ఆమె ఎంతో సంబరపడేది. తన ఫొటోతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని తన బంధువులకు అందరికి చూపుతూ ఆనందపడేది. ఇంతలో ఆమె బాత్‌రూంలో కిందపడం, అనారోగ్యానికి గురై మృతిచెందడం జరిగింది. ఈమె దహన క్రియలను గురువారం ఉదయం 9 గంటలకు ఆమె స్వగ్రామం నారాయణ నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ సృజన (ఫైల్‌ఫొటో)

- ప్రేమ పేరుతో వేధింపులే కారణం
- ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

రాయచోటిటౌన్, జూన్11(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వేధించడమే కాకుండా తన ప్రేమను ఇంట్లో చెప్తే తండ్రిని చంపేస్తానని భయపెట్టడంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయచోటి పట్టణ పరిధిలోని మిట్టావాండ్లపల్లెలో చోటు చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు వివరాలిలా.. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మిట్టావాండ్లపల్లిలో బేల్దారిగా జీవనం సాగిస్తున్న చంద్రగిరి ఉత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కూతురు సృజన (15) ఇటీవల పదవ తరగతిలో 554 మార్కులు సాధించింది. రాయచోటి పట్టణంలోని రాజు ఐఐటీ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ కూడా తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో సృజన ఇంటికి ఏడ్చుకుంటూ వచ్చింది. ఏం జరిగిందని తండ్రి ప్రశ్నించగా "తారక రత్న నిన్ను చంపేస్తాడంట. నాకు భయంగా ఉందినాన్న" అని చెప్పింది. ఎందుకు చంపుతాడని ప్రశ్నించగా.. తనను ప్రేమ పేరుతో తారకరత్న వేధిస్తున్నాడని, ఇంట్లో వాళ్లకు చెబుతానని హెచ్చరిస్తే అందుకు మీ నాన్నను కూడా చంపుతానని బెదిరించాడని అన్నారు. ఈ విషయం తారకరత్న తల్లిదండ్రులకు చెప్పి సమస్య పరిష్కరించుకుందామని అనుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పిల్లలంతా ఇంటిముందు ఆడుకుంటుండగా సృజన ఇంట్లోకి హడావిడిగా వచ్చి తారకరత్నతో తనకు భయమేస్తోందని చెప్పి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఎంతకూ బాలిక గడియ తీయకపోవడంతో తల్లిదండ్రులు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో సీలింగ్ కొక్కికి చీరతో ఉరి వేసుకుంది. వెంటనే సృజనను కిందకు దించి ఆటోలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చనిపోయిందని చెప్పారు. ప్రేమ పేరుతో వేధించి, భయపెట్టి తమ కుమార్తె చావుకు కారణమైన తారకరత్నపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఉత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ బీటీ చలపతి తెలియజేశారు. కాగా.. బాలికను వేధించిన తారకరత్న బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

నెల్లూరు, కడప జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, కడప జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. ఇందులో భువనేశ్వర్ 63 పరుగులు చేశారు. అనంతరం నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు ఉపక్రమించగా వర్షం రావడంతో టార్గెట్‌ను 45 ఓవర్లకు 224 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో కారుణ్యప్రసాద్ 50 పరుగులు చేశారు. ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. ఇందులో మురారి హృదయ్ 66 పరుగులు చేశారు. అనంతరం కడప జట్టు బ్యాటింగ్‌కు దిగిన సమయంలో వర్షం రావడంతో టార్గెట్‌ను 37 ఓవర్లలో 164 పరుగులకు కుదించారు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 30.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో రోహిత్ వర్మ 68 పరుగులు, రణధీర్‌రెడ్డి 55 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ కొత్త బస్సు పాసులు

కడప మారుతీనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ కొత్త బస్ పాసులను ఈనెల 14వ తేదీ శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. బస్సు పాసులు పొందగోరు విద్యార్థులు తమ వివరాలను ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా జెనరేటైన పిన్ నెంబర్ కౌంటర్‌లో తెలిపినచో బస్సు పాస్ కొరకు క్యూ-లైన్‌లో వేచి వుండే సమయం తగ్గుతుందన్నారు నమోదు ప్రక్రియ మొబైల్ ఫోన్ ద్వారా కూడా సులభంగా చేసుకునే వెసులు బాటు కలదన్నారు. విద్యార్థులు గమనించి సులభరీతిలో బస్సు పాస్ పొందాలని కోరారు. కాగా ఈనెల 12, 13 తేదీలలో ఆయా బస్టాండ్‌ల వద్ద గల బస్సు పాస్ కౌంటర్లకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్షలు

సీకేదిన్నె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో డీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం, కేవోఆర్ఎం, స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు జరుగుతున్నాయి. ప్రతి సెంటర్ వద్ద ఒక సీఐతో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

నూతన విధానాలు అవలంబిస్తే మంచి దిగుబడి

చెన్నూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో నూతన విధానాలను వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలతో పాటించి మంచి దిగుబడి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త డాక్టర్ రత్నకుమార్ అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామనపల్లె, కొండపేట గ్రామాల్లో రైతులతో పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. నూతన సాంకేతిక ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. నూనెగింజల శాస్త్రవేత్త డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ వేరుశనగలో రకాలు, పోషక యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ వరిలో ప్రస్తుత సాగులో దిగుబడిని అందించే రకాలు, భూసారపరీక్ష, పొటాషియం వినియోగంపై వివరించారు. డాక్టర్ అంకయ్య మాట్లాడుతూ అధిక దిగుబడి వచ్చేలా చిన్నపాటి మెళకువలు పాటించాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ వెంకటసుబ్బయ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ సురేశ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కె.సాయిమహేశ్వరి, సర్పంచ్‌లు తుంగ చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమణయ్య

కడప నాగరాజుపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుబేదార్ దాసరి రమణయ్య ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌గా ఉన్న పువ్వాడ లక్ష్మీ నారాయణ మార్చి 19న మృతి చెందడంతో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి రూ.52,116 వితరణ

నందలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో వెలసిన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి తుమ్మల(నామాల) శేషయ్య, కమలమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ జడ్పీటీసీ వెంకటమణి, కుటుంబసభ్యులు కలిసి రూ.52116 ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు దాతను సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏరువాకతో వ్యవసాయ పనులకు శుభారంభం

- డీఏవో చంద్రానాయక్



గ్యారంపల్లెలో ఏరువాక పనులను ప్రారంభిస్తున్న డీఏవో చంద్రానాయక్ తదితరులు

పీలేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి పుడమి తల్లిని పూజించుకునే గొప్ప అవకాశమని, ఏరువాకతో వ్యవసాయ పనులకు శుభారంభం అవుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డీఏవో) చంద్రానాయక్ తెలిపారు. కేవీపల్లె మండలం గ్యారంపల్లెలో బుధవారం వ్యవసాయశాఖ నిర్వహించిన ఏరువాక పౌర్ణమి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రోజున ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభించడం సంతోషకర మన్నారు. ప్రస్తుత సీజన్ కోసం కేవీపల్లె మండలానికి 2,340 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు కేటాయించామని, మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రస్తుత సీజన్‌లోని వివిధ పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులు, నూతన వంగడాలను రైతు లకు వివరించారు. కార్యక్రమంలో కలికిరి కేవీకే కో-ఆర్డినే టర్ డా.కె.మంజుల, వ్యవసాయశాఖ పీలేరు ఏడీ రమణరావు, ఏవోలు శ్రావణి, రమేశ్, టీడీపీ నేతలు వెంకటరమణారెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై తిరగబడిన యువకులు...?!

- రికార్డింగ్ డ్యాన్స్‌లను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- పోలీస్ జీపు అద్దం ధ్వంసం
- పది మందిపై కేసు



యువకుల దాడిలో ధ్వంసమైన పోలీస్ జీపు అద్దం

గుర్రంకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రికార్డింగ్ డ్యాన్స్ ప్రదర్శనకు పోలీసులు ఎందుకొచ్చారు. మా గ్రామంలోకి అడుగు పెట్ట డానికి ఎవరు అనుమతించారంటూ గెరికుంటపల్లెకు చెందిన కొందరు యువకులు పోలీసులపై రెచ్చిపోయి దాడికి యత్నించారు. కొంతమంది ఆకతాయిలు పోలీస్ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు, యువకుల మధ్య వాగ్వాదం జరుగుతుండగా ఇద్దరు యువకులు పోలీస్ జీప్‌పై రాళ్లు విసి రారు. దీంతో అద్దం ధ్వంసం కావడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఈక్ర మంలో గ్రామస్థులు అల్లరిమూకలకు మద్దతుగా పోలీసులను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మండలంలోని నడిమికండ్రిగలో పోలేరమ్మ జాతర సందర్భంగా మంగళవారం రాత్రి గెరికుంటపల్లెలో చాందినీ బండి ముందు హిజ్రాలతో డ్యాన్స్ చేయించేందుకు కొందరు యువకులు సిద్ధపడ్డారు. వారి ప్రయత్నాలను అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో రెచ్చిపోయిన కొందరు యువకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. దుర్భాష లాడుతూ దాడికి యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు పోలీసు జీపుపై రాళ్లు విసిరారు. దీంతో జీప్ అద్దం ధ్వంసమైంది. పోలీసులు అల్లరిమూకలను చెదరకొట్టడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, జీప్ అద్దం ధ్వంసం కావడానికి కారణమైన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో పోలీసులపై తిర గబడిన యువకులను అదుపులోకి తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. దీంతో వారు పరారైనట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



రికవరీ చేసిన ఆభరణాలను చూపుతున్న టూటౌన్ పోలీసులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మార్చి 15న జరిగిన దొంగతనాన్ని టుటౌన్ పోలీసులు ఛేదించి ఆభరణాలను రికవరీ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టుటౌన్ సీఐ సదాశివయ్య వివరాలు వెల్లడించారు. మార్చి 15న గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంటిలో 249 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ కేసుకు సంబంధించి చోరీకి పాల్పడిన జంగా వెంకట్రావు, సుధాకర్‌లను ఇతర జిల్లా పోలీసులు అరెస్టు చేశారన్నారు. వారిని పీటీ వారెంట్‌తో కోర్టులో హాజరుపరచి కస్టడిలోకి తీసుకుని చోరీకి సంబంధించిన ఆభరణాలు రికవరీ చేశామన్నారు. చోరీ అయిన ఆభరణాల్లో కొన్ని అమ్మి సొంత ఖర్చులకు ఉపయోగించుకోగా మిగిలిన ఆభరణాలను బద్వేలు టౌన్ దాటిన తర్వాత అటవీ ప్రాంతంలో దాచి పెట్టారన్నారు. దాదాపు 180 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. అలాగే చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన చోరీకి సంబంధించిన ఆభరణాలు రెండు రికవరీ చేశామన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ భావన ఆదేశాల మేరకు రికవరీ కోసం కృషి చేసిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి.. దళిత సంఘాల ఆందోళన





పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధరణీకుమార్, పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పీలేరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన టీడీపీ నేతను వెంటనే అరెస్టు చేయాలని పీలేరులోని దళిత సంఘాలు బుధవారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేశాయి. వారి కథనం మేరకు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా, టీడీపీ నేత పులిచెర్ల మహేశ్ దారికి అడ్డంగా కారు నిలిపాడు. దీంతో కారును పక్కకు పెట్టాలని ధరణి సూచించాడు. దీంతో కారును పక్కకు తీయకపోగా, ధరణిపై దాడి చేయడమే కాకుండా, ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది, వైద్యులను దూషించాడు. ఈ విషయంపై బుధవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. మహేశ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ యుగంధర్ దళిత సంఘాల నేతలతో ఫోనులో మాట్లాడి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. ధరణీకుమార్‌ను పీలేరు ఆసుపత్రిలోని పారిశుధ్య, ఇతర విభాగాల సిబ్బంది పరామర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జెట్టి మల్లికార్జున, టీఎల్ వెంకటేశ్, ఎర్రప్ప, నగరిమడుగు సుభాష్, సుధాకర్, పెద్దముత్యాలు, ఆటో యూనియన్ నాయకులు బోదేషా, తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

నిమ్మనపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తన మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఓ వృద్ధురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అగ్రహారం పంచాయతీ చింతపర్తివారిపల్లికి చెందిన యశోదమ్మ (65) భర్త మరణించడంతో ఒంటరిగా జీవిస్తోంది. మంగళవారం రాత్రి ఉక్కపోస్తుండడంతో ఇంటి తలుపులు తీసి నిద్రపోయింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఆమె మెడలోని దాదాపు 25 గ్రాముల బంగారు గొలుసును ఆమె మెడలో నుంచి లాక్కొని వెళ్లిపోయారు. రాత్రి సమయం కావడంతో తాను దొంగలను గుర్తుపట్టలేనని తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సబ్‌కలెక్టరేట్ డీఏవోగా నిర్మల



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసిన డీఏవో నిర్మల

మదనపల్లె టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్ డీఏవోగా నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామసముద్రం తహసీల్దార్‌గా పనిచేస్తున్న నిర్మలను సబ్‌కలెక్టరేట్ డీఏవోగా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నిర్మల సబ్‌కలెక్టర్‌ను కలసి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ పాలనాపరంగా పారదర్శకత చూపుతానన్నారు.

నిమ్మనపల్లి సీడీపీవోగా నాగవేణి

నిమ్మనపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సీడీపీవోగా నాగవేణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను తంబళ్లపల్లి మండలంలో పని చేసి నిమ్మనపల్లి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. మండలంలోని అంగన్వాడీల అభివృద్ధికి తోడ్పడతానని, కేంద్రాలలో సమస్యలను పరిష్కరిస్తానని తెలి పారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

గుర్రంకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నడిమికండ్రిగలో బుధవారం పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం చేశారు. మంగళవారం రాత్రి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలు గాయపడింది. స్థానిక అమ్మచెరువుమిట్ట ప్రాంతంలోని ఓ ఇంట్లో మంగమ్మ(65) తన కూతురు, మనవడితో కలసి నివసిస్తోంది. బుధవారం ఇంట్లో షార్టుసర్క్యూట్ అయ్యి కర్టన్‌కు మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో ఉన్న మంగమ్మ బయటకు పరుగెత్తలేక, మంటల్లో చిక్కుకుంది. స్థానికులు తీవ్రంగా గాయపడిన మంగమ్మను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళల అదృశ్యంపై కేసు నమోదు

ములకలచెరువు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. స్థానిక రాగిమానిపల్లెకు చెందిన సునంద, సుశీల మంగళవారం అదృశ్యమైనట్లు వారి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మదనపల్లె టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూడున్నర నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానిక వన్నూర్‌సాబ్ గుట్టకు చెందిన సలావుద్దీన్ (65) ఫిబ్రవరి 22న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి, వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సంక్షేమం'



విలేకరులతో మాట్లాడుతున్న 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

మదనపల్లె టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 ఏళ్ల బీజేపీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆర్థికంగా 2014లో ప్రపంచంలో 11వ స్థానంలో వున్న దేశం నేడు 4వ స్థానంలో నిలవడమే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి గతంలో రూ.5వేల కోట్లను బీజేపీ ప్రభుత్వం మంజూరు చేయగా, ఇప్పుడు రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తోందన్నారు. అమరావతి రింగ్‌రోడ్డు నిర్మాణానికి రూ.25వేల కోట్లు మంజూరు చేస్తోందన్నారు. విశాఖ ప్రాంతం అభివృద్ధికి రైల్వేజోన్ ప్రకటించిందని, భోగాపురం విమానాశ్రయం నిర్మాణం, విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి రూ.1200 కోట్లు కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం రూ.17 వేల కోట్లు కేటాయించిందని 2027 డిసెంబర్‌కు మొదటి దశ నిర్మాణాలు పూర్తి అవుతాయన్నారు. వీటితో పాటు హౌసింగ్, అమృత్, స్వచ్ఛభారత్, ఉపాధి హామీ పథకం, కార్మికుల సంక్షేమం ఇలా పలు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, భగవాన్, బండి ఆనంద్, ఓ. కిరణ్, భువనేశ్వరి సత్య, జర్మన్‌రాజు, మూడే పిల్లస్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలపై ఫిర్యాదు

మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న నిర్మాణాలపై 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌కు బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఫిర్యాదు చేశారు. బుధవారం మార్కెట్‌యార్డు వద్ద చైర్మన్‌ను కలసిన పునీత్ మాట్లాడుతూ ఈ అక్రమాలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరారు.

రూ.300 కోట్లతో తంబళ్లపల్లె అభివృద్ధి

● టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



ములకలచెరువులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రూ.300 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ములకలచెరువు, సోంపల్లె, పెద్దపాళ్యం, పర్తికోట, వేపూరికోట తదితర గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. సోంపాళ్యం, ములకల చెరువు సమీపంలోని చెన్నకేశవస్వామి, కనుగొండ రాయస్వామి ఆలయాలకు వెళ్లే రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తమ నియోజకవర్గాల లాగే తంబళ్లపల్లెకు అత్యధిక నిధులు కేటాయించారన్నారు నియోజకవర్గంలో రూ.10 కోట్లలో సీసీ రోడ్ల పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం పెద్దపాళ్యం సచివాలయంలో రైతులకు వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ మునిరాజు, ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నేతలు మత్తుకూరు మౌలా, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, చాంద్‌బాషా, ఆంజనేయరెడ్డి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, శ్రీనివాసులు, రెడ్డెప్ప, రమణమూర్తి, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇల్లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావాలి

● రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు రూ. 78 వేలు సబ్సిడీ

● 90 శాతం రుణ సౌకర్యం గృహ వినియోగదారులకు మాత్రమే : ఈఈ చంద్రశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

పీలేరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇల్లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావాలని పీలేరు ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం పీలేరు పట్టణం తిరుపతి మార్గంలోని తన కార్యాలయం వద్ద ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ. 78 వేలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. తద్వారా కరెంట్ బిల్లు ఆదాతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునన్నారు. ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్ అమర్చుకోవడం వల్ల నాలుగు దశాబ్దాల పాటు కరెంట్ బిల్లు లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చునని వివరించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. సంవత్సరానికి 7 శాతం వడ్డీతో 90 శాతం రుణం పొందవచ్చునని తెలిపారు. పది సంవత్సరాల పాటు సులభవాయిదాలతో రుణం చెల్లించవచ్చన్నారు. ఈ పథకం అమలులో దళారులు, మధ్యవర్తులు ఉండరన్నారు. బ్యాంకర్లు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఎస్ ఈ దేవేంద్రనాథరెడ్డి, పీలేరు మండల టీడీపీ అధ్యక్షుడు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కోటపల్లె బాబురెడ్డి, పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, రౌద్రాల అంకాలమ్మ ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి, డీఈ అమీర్ బాషా, ఏఈలు రామమూర్తి, ఇలాహి, పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు దుబ్బిగానిపల్లె ప్రాజెక్టు పరిశీలన



దుబ్బిగానిపల్లె వద్ద వాటర్‌షెడ్ ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మదనపల్లె టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నీటి సంరక్షణ ప్రాజెక్టు అవార్డుకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌ను ఎంపిక చేసే అంశం పరిశీలిస్తున్నామని కేంద్ర బృందం సభ్యుడు సర్తాజ్‌బాషా తెలిపారు. బుధవారం దుబ్బిగానిపల్లెలో డ్వామా పీడీ వెంకటరత్నం, సీడబ్ల్యూసీ ఏఈ సత్యమూర్తి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్యతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బిగానిపల్లెకు మంజూరు వాటర్‌షెడ్ పనులు పరిశీలించామని, అలాగే వినియోగదారులను పలు అంశాలపై విచారించామన్నారు. లబ్ధిదారులకు ఈ పనులు ఎలా ఉపయోగపడతాయి, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ వాటర్‌షెడ్ ప్రాజెక్టును జాతీయ నీటి సంరక్షణ అవార్డు ఎంపిక కోసం ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డయ్య, ప్రాజెక్టు అధికారి ఖాజామైనుద్దీన్, జేఈ ప్రత్యూష, టీఏ మల్లికార్జున, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అందని వైద్యం

● మండల సమావేశంలో సర్పంచ్ ధ్వజం..



డాక్టర్ ప్రత్యూషను నిలదీస్తున్న సర్పంచ్ రెడ్డెప్ప

నిమ్మనపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో తనకే వైద్యం అందకపోతే సామాన్యుడి పరిస్థితి ఏంటని తవళం సర్పంచ్ రెడెప్ప మండల సర్వసభ్య సమావేశంలో డాక్టర్ ప్రత్యూషను నిలదీశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నరసిహులు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ తనకు జ్వరం రావడంతో ఉదయం 11 గంటలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, అక్కడ వైద్యం చేసేందుకు ఎవరూ లేరన్నారు. దాదాపు 8 నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందడంలేదని, ఎప్పుడు ఆసుపత్రికి వెళ్లినా డాక్టర్ ఉండడంలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఇద్దరు డాక్టర్లున్నా కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే పరిమితమయ్యారని మండిపడ్డారు. ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే మండలంలో దాదాపు రూ.5 కోట్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన ప్రజలతో అధికారులు ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అభివృద్ధి పనుల వివరాలను శాఖలవారీగా అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్, పశువైద్యాధికారి సురేష్, ఏఈ నాగరాజ, ఎంఈవో పద్మావతి, ఏఈ మిధున్ చక్రవర్తి కార్యదర్శులు పాల్గొన్నారు.

92 వితంతు పింఛన్లు మంజూరు

కలికిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కలికిరి మండలంలోని 14 పంచాయ తీలకు 92 వితంతు పింఛన్లు కొత్తగా మంజూరయినట్లు ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. గురువారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నేరుగా పింఛన్ల మొత్తాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో పింఛన్లను పంపిణీ చేయించనున్నట్లు తెలిపారు. మండలంలోని అద్దవారిపల్లె పంచాయతీకి 6, చీకటిపల్లెకు 3, గుండ్లూరుకు 6, గుట్టపాలెంకు 9, కలికిరి కి 34, మహల్‌కు 3, మేడికుర్తికి 6, మర్రికుంటపల్లెకు 7, మునేళ్ళపల్లెకు 6, పల్లవోలుకు 6, పత్తేగడకు 6 పింఛన్లు మంజూరయినట్లు భానుమూర్తి వివరించారు.

అంగన్వాడీలలో పిల్లలకు పౌష్టికాహారం



మానవహారంలో అంగన్వాడీ అధికారులు, కార్యకర్తలు

వాల్మీకిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేం ద్రాలలో పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నామని వాల్మీకిపురం సీడీపీవో భారతి తెలిపారు. బుధవారం వాల్మీకిపురం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీ బస్టాండ్ ప్రాంతంలో మానవహారం నిర్మించి అంగన్వాడీ కేంద్రాలపై అవగాహన కల్పించారు. సామూహిక అక్షరభ్యాసం తదితర అంశాలపై పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో ఐసీడీఎస్ అధికారులు భారతి, రోహిణి, భానులక్ష్మి, రాణి, మహాలక్ష్మి, సర్తాజ్‌బేగం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన విద్యామిత్ర కిట్లు



విద్యామిత్ర కిట్లను పాఠశాలలకు తరలిస్తున్న ఎంఈవోలు

తంబళ్లపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ విద్యామిత్ర కిట్లు తంబళ్లపల్లె మండలంలోని 69 పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో విద్యామిత్ర కిట్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, యూనిఫారం, బూట్లు ఉంటాయన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. నేటి నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో వండిన నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిం చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చెత్తకుండీలను ఉపయోగించుకోవాలి



క్లాప్ మిత్రలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

కలకడ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్తకుండీలను ప్రజలు ఉపయోగించుకోవాలని టీడీపీ నాయకులు సూచించారు. బుధవారం కలకడ, బాలయ్యగారి పల్లె పంచాయితీల్లో తడి, పొడి చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. క్లాప్‌మిత్రలకు దుస్తులు, గ్లౌజులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పొత్తూరి ప్రభాకర్ నాయుడు, సర్పంచ్ విశ్వనాథ్, కార్యదర్శి దేవేంద్ర, జిలానీ, అలీ, జాఫర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం..



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ధర్మపథం సమూహాలయంలో బుధవారం ఉదయం 9గంటలకు సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం చేశారు. రాత్రి కార్యసిద్ధి అభయాంజనేయ స్వామికి సింధూర పూజ, ఆకుపూజ, వడమాల, తోమాల సేవ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల గంగమ్మకు భారీగా బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

తంబళ్లపల్లె, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని శివపురం దారిలో బుధవారం ఎర్రగుంట్ల గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి దీలూ, బోనాలూ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు పూలతో అలంకరించిన ఎద్దుల బండిని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తంబళ్లపల్లెతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

నరసింహస్వామికి చక్రస్నానం



చక్రస్నానానికి సిద్ధంగా ఉన్న స్వామి వారు

కలికిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా కలికిరి లక్ష్మీనరసింహస్వామికి బుధవారం చక్రస్నానం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఉదయాత్పూర్వమే స్వామి వారికి తిరుమంజనం, అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. సాయంకాలం ధ్వజావరోహణ చేశారు. అనంతరం నిర్వహించిన చక్రస్నానం కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అర్చకులు మురళీధరాచార్యులు, శ్రీకాంతాచార్యులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం



కలికిరి: విత్తన కాయలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మాలతి



వాల్మీకిపురం: వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పీలేరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వాల్మీకిపురం రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ చైర్మన్ చంద్రమౌళి, ఏవో హేమలత, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, నాయకులు కృష్ణారెడ్డి, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, శేషాద్రిరెడ్డి, పులి సత్యారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు చాను, కోసూరి రమేష్, మురళి, కేకేనాయుడు, సాదిక్, కువైట్‌బాబు, సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ యూసుఫ్, జంషీద్, రామాంజులరెడ్డి, గాంధీపేట రెడ్డి, మంజునాథరెడ్డి, ఆది నారా యణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నా రు.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో స్థానిక కూటమి నేతలతో కలిసి వేరుశెనగ కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రేమలత మాట్లాడుతూ రైతులకు ఒక ఎకరాకు ఒక బస్తా, ఆపైన ఉన్న రైతులకు రెండు బస్తాలను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా సురేంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, జనసేన మండల అధ్యక్షుడు శంకర, సెల్ షాపు సూరి,కార్యం సుబ్రమణ్యం, సాయి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: మండలంలో కమిటీ చైర్‌పర్సన్ మాలతి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు కలికిరి పట్టణంలో విత్తన కాయలను నిల్వ చేసిన చదివేవాండ్లపల్లె పాఠశాలలో మొదట పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సమీవుల్లా, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, టీడీపీ నాయకులు దినకర్, వైజాగ్ బాషా, వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..

● రైతు సేవా కేంద్రాలుగా మారని ఆర్బీకేలు



ఆర్బీకే భవనంపై మారని పేరు

పెద్దతిప్పసముద్రం జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ఇకపై రైతు సేవా కేంద్రాలు వ్యవహరించాలని కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు మండలంలో అమలుకు నోచుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే, ప్రభుత్వం మారి ఏడాది గడుస్తున్నా పలు కేంద్రాలు ఇంకా ఆర్బీకే గానే దర్శనం ఇస్తున్నాయి. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటి పేర్లను రైతుసేవా కేంద్రాలుగా మార్చాలని కోరుతు న్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలను జారీ బేఖాతరు చేస్తున్న అధికారుల పని తీరును పలువురు విమ ర్శిస్తున్నారు.